
సాక్షి
పల్నాడు
శనివారం, 2, మార్చి, 2024



పోలీస్ కుటుంబాలకు చెక్కులు

నగరంపాలెం: అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఫ్లాగ్ ఫండ్ రూ.75 వేలు, కార్పస్ ఫండ్ రూ.లక్ష చెక్కు అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 516.00 అడుగుల వద్ద ఉంది. సాగర్ కుడికాలువకు 6,006 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్‌గా శోభన్ బాబు



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఆచార్య కె శోభన్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, మ్యాథమెటిక్స్ విభాగం ఆచార్యులుగా పనిచేశారు.

న్యూస్‌రీల్

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు తాగు నీటి అవసరాల నిమిత్తం కృష్ణానది యాజమాన్య బోర్డు ఈఈ రఘునాథ్‌రావు, డీఈ గాయత్రి పర్యవేక్షణలో శుక్రవారం నీటిని విడుదల చేశారు. కుడి కాలువకు 5, 7వ గేటు ద్వారా ఉదయం 10.30 గంటలకు గేటుకు 1,000 క్యూసెక్కుల చొప్పున రెండు గేట్ల ద్వారా 2వేల క్యూసెక్కులను విడుదల చేశారు. కుడి కాలువకు గంటకు 2 గేట్ల ద్వారా 2,000 క్యూసెక్కుల చొప్పున పెంచుతూ మధ్యాహ్నం 1.30 గంటలకు 6,000 క్యూసెక్కులను విడుదల చేశారు. 9 రోజుల పాటు నీటి విడుదల కొనసాగుతుందని సాగర్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగర్ ప్రాజెక్టు ఈఈ శ్రీహరి, డీఈ మురళీధర్, జేఈలు బాబుమియా, సుధ, సాగర్‌ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సంక్షేమానికి గ్రీవెన్స్ డే



నగరంపాలెం: పోలీస్ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పలువురు ఉద్యోగులు, మినిస్ట్రీరియల్ సిబ్బందితో మాట్లాడారు. వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పలువురు వ్యక్తం చేసిన సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలపై పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

రేపటి వరకు ఈ-క్రాప్‌పై సామాజిక తనిఖీ

కొరిటెపాడు(గుంటూరు): రబీకి సంబంధించిన ఈ-క్రాప్ నమోదుపై ఆదివారం వరకు గ్రామ సభల ద్వారా సామాజిక తనిఖీ కొనసాగిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తర్వాత ఈ-క్రాప్ తుది ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వానికి, కమిషనరేట్‌కు పంపుతామని పేర్కొన్నారు. ఈ రబీలో అన్ని పంటలు కలిపి 1,57,465 ఎకరాలలో పంటలు సాగులోకి వచ్చినట్లు ఈ-క్రాప్ ద్వారా స్పష్టమవుతోందని తెలిపారు. ప్రధానంగా మొక్కజొన్న, జొన్న, మినుము, మంచి శనగ, పెసర తదితర పంటలు సాగులోకి వచ్చాయని పేర్కొన్నారు. రైతు భరోసా సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ గ్రామానా ఆదివారం సాయంత్రం వరకు ఈ-క్రాప్ సామాజిక తనిఖీ నిర్వహిస్తామని తెలిపారు. పొరపాట్లు ఉంటే సవరించుకోవాలని కోరారు. రబీ సీజన్ పంట నమోదులో సవరణ కోసం ఇది చివరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎలాంటి మార్పులు, చేర్పులు చేయబడవని ఆయన రైతులకు సూచించారు.

కార్తికేయునికి వెండి నాగ పడగ సమర్పణ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి నరసరావుపేటకు చెందిన భక్తులు అనుమోలు జగదీష్‌కుమార్ 570 గ్రాములతో చేసిన వెండి నాగపడగను సమర్పించారు. శుక్రవారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న ఆయన వెండి పడగను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం జగదీష్‌కుమార్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డులో 1,39,573 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,21,485 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,39,573 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 20,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 20,700 వరకు లభించింది.

మురిపించేన్

చంద్రబాబు స్వార్థ రాజకీయాలు, అనాలోచిత నిర్ణయాల వల్ల రాజధాని ప్రాంతంలో వేలాది మంది పేదలు ఉపాధి కోల్పోయారు. పేదల ఆందోళన ఫలితంగా పింఛన్ రూ.2,500 ఇచ్చేందుకు అంగీకరించిన టీడీపీ ప్రభుత్వం అందులోనూ వివక్ష చూపింది. తన వారికే వడ్డించింది. ఇటీవల ఫిరంగిపురంలో జరిగిన సభలో పేదల కష్టాలు విన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ రూ.5000లకు పెంచుతూ జీవో విడుదల చేశారు. పెంచిన పింఛన్‌ను శుక్రవారం అందుకున్న పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

- రాజధానిలో భూమిలేని నిరుపేదల పింఛన్ పెంపు
- రూ.2500 నుంచి రూ.5000 చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల
- ఫిరంగిపురం సభలో ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్
- 17,215 మంది భూమిలేని నిరుపేదలకు లబ్ధి
- రాజధాని కూలీల్లో హర్షం



తుళ్లూరులో రాజధాని రైతు కూలీలకు పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

తాడికొండ: గత ప్రభుత్వ హయాంలో భూమిలేని నిరుపేదలకు న్యాయం చేయాలని పలుమార్లు రైతు కూలీలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు నాడు పోరాటం చేయగా అరకొరగా చేయి విదిల్చిన చంద్రబాబు రూ.2500 పింఛన్ ఇచ్చేందుకు అంగీకరించారు. 10 సంవత్సరాలుగా దానిని పెంచిన దాఖలాలు లేకపోవడంతో రైతు కూలీలు ఇటు ఉపాధి లేక, అటు ప్రభుత్వం అందించే పింఛన్ చాలక నానా ఇబ్బందులు పడ్డారు. పింఛన్ సొమ్ము రూ.2500ను రూ.5000లకు పెంచుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. శుక్రవారం నుంచి పెంచిన పింఛన్ సొమ్ము చెల్లించనున్న నేపథ్యంలో తమకు ఆర్థిక బాధలు తొలగనున్నాయని వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతు కూలీలు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీని వలన రాజధాని 29 గ్రామాల్లో భూమిలేని నిరుపేద కుటుంబాలకు చెందిన 17215 కుటుంబాలు లబ్ధి పొందనున్నారు. ఫిబ్రవరి 15వ తేదీన గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపురంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. రాజధాని ప్రాంతంలో భూమిలేని నిరుపేదలకు అందించే జీవన భృతి పింఛన్లు చాలడం లేదని, వారికి రూ.5000 అందించాలని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సభలో కోరగా స్పందించిన సీఎం వెంటనే ఆ హామీ నెరవేర్చుతున్నట్లు సభలో ప్రకటించారు. 15 రోజుల్లోనే హామీని నెరవేర్చి రాజధాని ప్రాంతంలో నిరుపేద కుటుంబాల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారు. తమకు మేలు చేసిన జగనన్నకు జేజేలు పలుకుతున్నారు. తాడికొండ నియోజకరవ్గంలోని తుళ్లూరులో శుక్రవారం నిర్వహించిన సభలో రైతు కూలీలకు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని నిడమర్రు, యర్రబాలెంలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, సమన్వయకర్త గంజి చిరంజీవి పింఛన్ నగదు అందజేశారు.



నిడమర్రులో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా రైతు కూలీలు

టీడీపీ హయాంలో ఒక్కొక్కరికి ఓ న్యాయం



తెలుగుదేశం పార్టీ హయాంలో పేదలకో న్యాయం, పెత్తందారులకో మరో న్యాయం జరిగింది. రైతులకు, అసైన్డ్ రైతులకో ప్యాకేజీ ఇచ్చి వ్యవసాయ కూలీలను మాత్రం నిలువునా మోసం చేశాడు. ఇక్కడ ఉపాధి లేక పనుల కోసం పక్క ప్రాంతాలకు వలస వెళ్లి కడుపు నింపుకున్నాం. మాకిచ్చిన జీవన భృతి పింఛన్ కూడా అప్పటి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఒత్తిడి తీసుకొస్తే గానీ ఇవ్వలేదు.

– పఠాన్ చాంద్ బీ, మందడం

జగనన్నకు ధన్యవాదాలు



రైతులతోపాటు జీవన భృతి పింఛన్ కూడా పెంచుతూ పోతే మాకు కూడా లబ్ధి జరిగేది కానీ బాబు మాత్రం తమ సామాజిక వర్గానికి మాత్రమే లబ్ధి చేకూర్చి మాలాంటి పేదలకు మాత్రం అరకొరగా ఎంగిలి చేతిని విదిలించి మోసం చేశాడు. మాకు మేలు చేసేలా పింఛన్ రూ.5000 చేసిన జగనన్నకు ధన్యవాదాలు

– పఠాన్ నాగుల్ బీ, మందడం

బాబు పేదల ఉసురు పోసుకున్నారు



అమరావతి పేరుతో అభివృద్ధి చేస్తానని చెప్పిన చంద్రబాబు ఈ ప్రాంతంలో మూడు పంటలు పండే భూములు తీసుకోవడంతో అడవిలా మారింది. ఉపాధి లేకుండా చేసిన కారణంగా మాకు జీవనం నానా ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు జగనన్న రూ.5000కు పెంచి మాకు మేలు చేశాడు. బాబు చేసిన నిర్వాహకం కారణంగా పడ్డ పాట్లు అంతా ఇంతా కాదు అభివృద్ధి చేయకపోగా అడవిలా మార్చి మా ఉసురు పోసుకున్నారు.

– చలివేంద్రం లక్ష్మి, వెలగపూడి

జెడ్పీ నిధులతో టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

- రూ.61.20 లక్షల నిధులు మంజూరు
- ఉత్తర్వులు విడుదల
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 25వేల మంది టెన్త్ విద్యార్థులకు లబ్ధి

గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు సాయంత్రం వేళల్లో అల్పాహారాన్ని అందించేందుకు జిల్లా ప్రజా పరిషత్ నిధులు విడుదల చేసింది. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సూచనలతో రూ.61,20,225 నిధులు మంజూరు చేస్తూ జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ వసంత రాయుడు గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. గతేడాది గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని 25వేల మంది జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.50 లక్షల జెడ్పీ నిధులతో నెల రోజులపాటు అల్పాహారాన్ని అందజేయగా, ప్రస్తుత విద్యాసంవత్సరంలో 27,201మంది విద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు రూ.61.20 లక్షలు నిధులు మంజూరు చేశారు. జనవరి 30న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. నిధులను ఆయా జిల్లాల వారీగా డీఈవోలకు అందజేయనున్నారు. విద్యాశాఖాధికారుల ద్వారా జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు జమ చేయించి, ప్రతి రోజూ అల్పాహారాన్ని అందించే విధంగా చర్యలు చేపట్టారు. విద్యార్థులకు మేలు జరుగుతుందని అంటున్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5800, గరిష్ట ధర రూ.7100, మోడల్ ధర రూ.6400 వరకు పలికింది.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- మౌలిక వసతుల కల్పన
- 706 మంది జూనియర్ ఇంటర్, ఒకేషనల్ విద్యార్థులు గైర్హాజర్



పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థినులు

సత్తెనపల్లి: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు రాశారు. ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించగా విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకుని తమకు కేటాయించిన గదుల నెంబర్లు పరిశీలించుకున్నారు. ఉదయం 8:30 గంటలకు విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. 9 గంటలలోపే విద్యార్థులంతా పరీక్ష కేంద్రాలకు హాజరయ్యారు. ఎలాంటి ఉరుకులు పరుగులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలకు హాజరయ్యారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలకు ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 14,733 మంది హాజరు కావాల్సి ఉండగా 14,140 మంది హాజరయ్యారు. 593 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 885 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 593 మంది హాజరుకాగా 113 మంది విద్యార్థులు గైరహాజరయ్యారు. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం, ఒకేషనల్ కలిపి 706 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించారు. ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు పరీక్షలను పర్యవేక్షించగా, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలో పర్యటించి పరీక్షలను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాయి. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను పోలీస్ పహారాలో కేంద్రాలకు చేర్చారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో భాగంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఉంచి పరీక్షలు జరుగుతున్న తీరును మానిటరింగ్ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఏదైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే ప్రథమ చికిత్స చేసేందుకు మెడికల్ సిబ్బంది సేవలను అందుబాటులో ఉంచారు. నరసరావుపేటలోని పలు పరీక్ష కేంద్రాలను పల్నాడు జిల్లా డీఐఈఓ నీలావతిదేవి సందర్శించారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం

- ప్రతి శుక్రవారం పట్టణాల్లో నగరోదయం
- గ్రామీణ ప్రాంతాల్లో గ్రామోదయం
- సాంకేతిక సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం
- జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి



సత్తెనపల్లిలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమైన కలెక్టర్ శివశంకర్ లోతేటి

సత్తెనపల్లి: జిల్లాలోని ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చేరువ చేయడమే లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నామని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. సత్తెనపల్లిలోని 8వ సచివాలయం పరిధిలోని 25 వార్డులో శుక్రవారం నిర్వహించిన నగరోదయంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారుల బృందంతో కలిసి ప్రతి శుక్రవారం పట్టణ ప్రాంతాల్లో నగరోదయం, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామోదయం పేరుతో క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల మధ్యలో ఎంపిక చేసిన పట్టణంలోని వార్డులో, గ్రామంలో ఆ వారంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యతలను ఏ విధంగా జరుగుతున్నాయో .. అభివృద్ధి, సంక్షేమం అమలుకు సమస్యలు ఏమైనా ఉన్నాయా! ఉంటే వాటిపై అధికారులతో సమీక్షించుకొని సాంకేతిక సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరిస్తామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమై వారి సమస్యలపై చర్చించి వారితో కలిసి టీ తాగారు. ముందుగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు తదితర వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, తహసీల్దార్ సీహెచ్ ఉష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌సారధి, ఎంఈవో ఎ.శ్రీనివాసరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి ఉన్నారు.

పెండింగ్ ఫారాలను పూర్తి చేస్తాం

నరసరావుపేట: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం 6,7,8 సమస్యలను పరిష్కరించి రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపుతున్నామని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఎన్నికల సంఘ సీఈవో ముఖేష్ కుమార్‌కు తెలిపారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి పలు అంశాలపై ఎన్నికల సంఘ సీఈవో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, డీఆర్వో కె.వినాయకంతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో అష్యూర్డు మినిమం ఫెసిలిటీస్ అన్ని పూర్తిచేశామని, నోడల్ అధికారులను నియమించడం, ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. పెండింగ్ ఫారాలను త్వరితంగా పూర్తిచేస్తామని తెలిపారు. కలెక్టరేట్ ఏవో జి రవి పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సరఫరాకు చర్యలు

రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుంచి మండల ప్రత్యేక అధికారులు, మండలాధికారులతో గ్రామోదయం, నవోదయం కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బంగారుతల్లి కార్యక్రమంపై తల్లుల్లో అవగాహన కల్పించాలన్నారు. రానున్న 10వ తరగతి పరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా చర్చించి వారి వారి పిల్లలు పరీక్షలు బాగా రాసేలా అవగాహన కల్పించాలన్నారు.

ప్రమాదాన్ని రాజకీయంగా వాడుకుంటున్న నీచుడు

- జూలకంటిపై ప్రభుత్వ విప్ పిన్నెల్లి ఆగ్రహం
- మల్లవరంలో జరిగింది ప్రమాదం
- ఆ విషయం ప్రత్యక్ష సాక్షి, మృతురాలి బంధువులే చెబుతున్నారు
- అన్నీ తెలిసి గ్లోబల్ ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు



సాక్షి, నరసరావుపేట: ప్రమాదవశాత్తూ ఓ ఎస్టీ మహిళ చనిపోతే సానుభూతి వ్యక్తం చేయాల్సింది పోయి, ఆ చావును రాజకీయంగా వాడుకుంటున్న నీచుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రెంటచింతల మండలం మల్లవరం గ్రామంలో శుక్రవారం ఓ వృద్ధురాలు వాటర్ ట్యాంక్‌లో నీటిని పట్టుకునే క్రమంలో ప్రమాదవశాత్తూ మరణించిందని, ఆ విషయం మృతురాలు బంధువు, ప్రత్యక్ష సాక్షి బనావత్ కృష్ణా నాయక్ తెలిపారన్నారు.

అది ప్రమాదమని జూలకంటి బ్రహ్మానందరెడ్డికి సైతం తెలుసునన్నారు. అయినా రాజకీయం చేస్తున్నాడంటే ఎంత దిగజారిపోయాడో అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పటిదాకా నీ మాటలు చూసి పల్నాటి పౌరుషం నీలో ఉన్నాయని అనుకున్నా, ఆధిపత్యం కోసం హత్యలు చేస్తావు అనుకున్నా కానీ ప్రమాదాన్ని కూడా కుట్రతో హత్యగా మలిచి నీ నీచత్వాన్ని బాహ్య ప్రపంచానికి చూపించినట్లు అయ్యిందన్నారు. ప్రజలు నీ కుట్ర రాజకీయాల్ని తిప్పికొట్టే సమయం వచ్చిందని అన్నారు. నీ వక్ర బుద్ధి చూస్తుంటే నియోజకవర్గంలో ఇంకెన్ని చావులు జరుగుతాయా.. వాటిని రాజకీయంగా ఎలా వాడుకోవాలా అని ఎదురు చూస్తున్నట్లు ఉందన్నారు. రాజకీయం మగతనంతో చేయాలని, ఇలా అడ్డదారుల్లో కాదని హితవు పలికారు. గ్లోబల్ ప్రచారంలో చంద్రబాబును మించి పోయినందుకు బ్రహ్మానందరెడ్డిని అభినందించాల్సి ఉందన్నారు. ప్రజలందరూ గమనిస్తున్నారని పచ్చ మీడియాలో మీ పార్టీ చేసే కుట్రలను ఓటుతో తిప్పికొడతారన్నారు.

ప్రభుత్వ సాయం, లక్ష్యంతో చదువుకోవాలి



కలెక్టరేట్‌లో విద్యార్థులకు మెగా చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

- జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్
- 34,652 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.32.57కోట్లు జగనన్న విద్యా దీవెన నిధులు జమ

నరసరావుపేట: ప్రభుత్వం చేస్తున్న సహాయంతో విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఎంచుకొని వాటి కోసం తీవ్రంగా ప్రయత్నం చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లా పామర్రు నుంచి వైఎస్సార్ విద్యా దీవెన మొదటి త్రైమాసిక సొమ్మును వారి ఖాతాలలో జమ చేసే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో వీక్షించారు. దీనికి హాజరైన విద్యార్థులతో మాట్లాడుతూ వారి వారి లక్ష్యాలను అడిగి తెలుసుకొని ఆ లక్ష్యాల సాధనకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో 34,652 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.32.57కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. అందులో ఎస్సీ తల్లులు 7070 మందికి రూ.5.65కోట్లు, ఎస్టీ తల్లులు 2494 మందికి రూ.2.10కోట్లు, బీసీ తల్లులు 10814 మందికి రూ.9.79కోట్లు, ఈబీసీ తల్లులు 8468 మందికి రూ.9.50కోట్లు, కాపు తల్లులు 2616 మందికి రూ.2.46 కోట్లు, ముస్లిం మైనార్టీలకు 3229 మందికి రూ.2.96కోట్లు, క్రిస్టియన్ మైనార్టీలైన 109 మందికి రూ.0.11కోట్లు కలిపి మొత్తం 34,652 మంది తల్లుల ఖాతాలో రూ.32.57కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ఆయన విద్యార్థిని విద్యార్థులకు మెగా చెక్కు అందజేశారు.

పల్స్‌పోలియోపై అవగాహన అవసరం

బాపట్ల :పల్స్‌పోలియోపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానికంగా పల్స్‌పోలియోపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ ఈనెల మూడో తేదీ నుంచి 0-5సంవత్సరాల పిల్లలకు పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు చుక్కలు చిన్నారుల జీవితాలకు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, మలేరియా అధికారి వై.రాజకుమార్, డాక్టర్ సౌజన్య, జ్యూగుంట రాంబాబు, మరియమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.21.70లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



నరసరావుపేట: నియోజకవర్గంలోని 17 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.21.70 లక్షల నగదు చెక్కులు మంజూరయ్యాయి. వీటిని శుక్రవారం ప్రకాష్ నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బాధితులకు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకోలేని వారికి ఈ సాయం అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, షేక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆషాబేగం ఖాజావలి, రాంబాబు, జి.అచ్యుతరావు తదితరులున్నారు.

శిలాఫలకాల ధ్వంసం



రొంపిచర్ల: కర్లకుంట గ్రామంలోని రైతుభరోసా కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ శిలా ఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఉదయం ఆర్బీకేకు వచ్చిన వీఏఏ, పాఠశాల ఉపాధ్యాయులు విషయాన్ని గమనించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే భవనం, మనబడి నాడు–నేడులో భాగంగా అభివృద్ధి చేసిన పాఠశాల ప్రారంభోత్సవాల శిలా ఫలకాలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గతంలో ఆవిష్కరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కేపీ రవీంద్ర తెలిపారు.

జిల్లాలో 48.96 శాతం పింఛను పంపిణీ

నరసరావుపేట రూరల్: వైఎస్సార్ పింఛను కానుకను మంగళవారం జిల్లాలో 48.96 శాతం పంపిణీ చేశారు. జిల్లాలో 2,83,119 మందికి రూ.84,58,51,500లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా తొలిరోజు 1,38,618 మందికి రూ.41,41,07,500లు వలంటీర్లు అందజేశారు. లింగంగుంట్ల సచివాలయం–2 పరిధిలో పింఛన్ల పంపిణీని డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్ పరిశీలించారు. అక్కడే వృద్ధురాలికి పింఛను నగదు అందజేశారు.

చంద్రబాబును కూడా ఓడించి చరిత్ర సృష్టిద్దాం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- కొమెరపూడిలో రూ.3.19 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం, శంకుస్థాపన
- సీఎం జగన్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు: ఎంపీ నందిగం

సత్తెనపల్లి : రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుని కూడా ఓడించి చరిత్ర సృష్టిద్దామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన రూ.3.19 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో బాపట్ల ఎంపి నందిగం సురేష్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం జగనన్న చేస్తున్న సిద్ధం సభలు చరిత్ర సృష్టిస్తున్నాయన్నారు. భీమిలి, రాప్తాడు, ఏలూరు సిద్ధం సభలు చూశాక టీడీపీకి నిద్రపట్టడం లేదన్నారు. టీడీపీ రా కదలిరా సభలకు వచ్చే వాళ్లు ఎవరూ లేరని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించటం ఖాయమన్నారు. చంద్రబాబును, పవన్ కల్యాణ్‌ను 2019లోనే అధఃపాతాళానికి ప్రజలు తొక్కారన్నారు. చంద్ర బాబు 23 సీట్లకు పరిమితమై పుత్రరత్నం లోకేష్‌ను కూడా గెలిపించు కోలేక పోయారని, ఇక పవన్ కల్యాణ్ రెండు చోట్ల పోటీ చేస్తే ఒక్క చోట కూడా గెలవలేదని గుర్తుచేశారు. వీళ్లా జగన్‌తో పోటీ పడేదని అంబటి ఎద్దేవా చేశారు. 2024 ఎకన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం సృష్టించటం ఖాయమన్నారు. రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీలు పొత్తులో వచ్చినా, ఇంకెవ్వరితో కట్టకట్టుకొని కలిసి వచ్చినా జననేత వైఎస్.జగన్ గెలుపును నిలువరించడం అసాధ్యమన్నారు. ఒక్క చోట కూడా గెలవని పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, లేకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టి, అక్కడ ఎలాంటి ప్రభావం చూపలేక కాంగ్రెస్‌లో విలీనం చేసి.. ఇక్కడికొచ్చి హడావుడి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ కోడలికి ఇక్కడేం పని అని ప్రశ్నించారు. గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజ నారాయణ మాట్లాడుతూ పవన్ కల్యాణ్‌ను పూర్తిగా ప్రజలే తొక్కి వేసే సమయం దగ్గర పడిందన్నారు. నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణకు డిపాజిట్లు గల్లంతవ్వటం ఖాయమన్నారు.



కొమెరపూడిలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన ఎంపీ నందిగం సురేష్

రూ.3.19కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభం

మండలంలోని కొమెరపూడి గ్రామంలో రూ. 83.60 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి భవనాల ప్రారంభోత్సవం, రూ.2.35 కోట్ల అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు శుక్రవారం రాత్రి అట్టహాసంగా జరిగాయి. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనంను బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ప్రారంభించారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామం నుంచి ఫిరంగిపురం మండలం యర్రగుంటపాడు వరకు అధ్వానంగా ఉన్న రహదారిలో రూ.2.20 కోట్లతో బీటీ రోడ్డు, బీసీ రజక కాలనీలో రూ.15 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, శిలా ఫలకాలను మంత్రి అంబటి రాంబాబు ఆవిష్కరించారు. ముందుగా గ్రామంలోని ఎస్సీ కాలనీ నుంచి బీసీ కాలనీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ రాజ నారాయణ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహాసంతి, నియోజకవర్గ నాయకుడు సూరిబాబు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర రెడ్డి, ఎంపీపీ ఎలవర్తిపాటి షేక్ జైబూన్‌బీ, జెడ్పీటీసీ సభ్యులు సంకటి నాగేశ్వరమ్మ, సునీతా రెడ్డి, సర్పంచ్ కొరివి అనిల్‌కుమార్, సత్తెనపల్లి, నకరికల్లు, రాజుపాలెం మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



సచివాలయం భవనం ప్రారంభిస్తున్న మంత్రి రాంబాబు, పక్కన ఎంపీ సురేష్

‘ఈ–పంట’ ముసాయిదా జాబితా ప్రదర్శన

- ఈ నెల 5 వరకు అభ్యంతరాలకు అవకాశం
- జిల్లా వ్యవసాయశాఖాధికారి ఐ.మురళీ

నరసరావుపేట రూరల్: జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ–పంట ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కోసం ఈ నెల 3వ తేదీ వరకు అందుబాటులో ఉంచుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ తెలిపారు. అచ్చంపేట ఆర్బీకేను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముసాయిదా జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీలో జిల్లాలోని 97,367 ఎకరాల్లో సాగు చేసిన రకాల పంటలు, రైతుల వివరాలు ఈ–పంటలో నమోదు చేసినట్లు తెలిపారు. ఉచిత పంటల బీమా, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, మద్దతు ధరకు వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ వంటి రైతు సంక్షేమ కార్యక్రమాలకు ఈ–క్రాప్ బుకింగ్ మూలాధారమని స్పష్టం చేశారు. ఆదివారం వరకు ఈ–క్రాప్ బుకింగ్‌పై సామాజిక తనిఖీతో పాటు గ్రామ సభలు నిర్వహిస్తామని వివరించారు. గ్రామ సభల్లో ఆర్బీకే సిబ్బంది ముసాయిదాలోని వివరాలు చదివి వినిపిస్తారని తెలిపారు. రైతులు అభ్యంతరాలు ఉంటే సవరణ కోసం ఈ నెల 5వ తేదీలోపు వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. 2023–24 రబీ సీజన్‌లో ఈ–పంట సవరణ కోసం ఇదే చివరి అవకాశమని వెల్లడించారు. తుది జాబితాను ఈ నెల 8న ప్రదర్శిస్తామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అచ్చంపేట ఆర్బీకేలో ముసాయిదా జాబితాను పరిశీలిస్తున్న డీఏవో మురళీ

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

దేవవరంలో పర్యటించిన జేసీ ఎ.శ్యాంప్రసాదు

నకరికల్లు: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. దేవవరం గ్రామంలో గ్రామోదయం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి జేసీ గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. రేషన్, పింఛను పంపిణీని స్వయంగా పరిశీలించారు. అమూల్ పాల కేంద్రంలో పాలవెల్లువ లబ్ధిదారులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఆదర్శపాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఆయన వెంట డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.బాలూనాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవ రెడ్డి, తహసీల్దారు ఎల్.లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ డి.జయమణి, వీఆర్వో పి.వి.కోటేశ్వరరావు, కార్యదర్శి అబ్దుల్లా, ఉప సర్పంచ్ భవనం రమణారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు దొండేటి కోటిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న జేసీ శ్యాంప్రసాద్

ఆదర్శ పాఠశాలల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

డీఈఓ ఎం.వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల్లో (మోడల్ స్కూల్స్) 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. 5వ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఆబ్జెక్టివ్ టైప్‌లో ప్రశ్నపత్రం ఉంటుందని వివరించారు. మార్కులు, రిజర్వేషన్ ప్రకారం పాఠశాలల్లో ప్రవేశం ఉంటుందన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించాలన్నారు. విద్యార్థులు www.cre.ap.gov.in/apmr.ap.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 31వ తేదీలోపు నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫీజు చెల్లించిన వారికి ఒక జనరల్ నెంబరు కేటాయిస్తారని, సదరు నంబరుతో ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులు అప్‌లోడ్ చేయవచ్చని తెలిపారు. వివరాలకు ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపల్స్, జిల్లా, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో సంప్రదించవచ్చని డీఈఓ చెప్పారు.

వేసవిలో ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష



నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ విధానంలో ప్రతి రైతు తమ భూమి 365 రోజులూ పచ్చగా ఉండేవిధంగా పీఎండీఎస్ 30 రకాల విత్తనాలు చల్లుకోవాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం అమలకుమారి సూచించారు. వేసవి కాలం ప్రకృతి వ్యవసాయం ప్రణాళికపై శుక్రవారం స్థానిక కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో పలు విధానాలున్నాయని, ముఖ్యమైన ఏటీఎం విధానంతో రైతులకు నిరంతరం ఆదాయం వస్తుందని తెలిపారు. పేద, నిరుపేద రైతులు కొద్దిపాటి నేలలో ఈ విధానంలో సాగుచేసుకొని ఆరోగ్యవంతమైన ఆహారం, ఆదాయం పొందొచ్చని వివరించారు. రైతు సాధికార, పేదరిక నిర్మూలన సంస్థల అనుసంధానంతో ఇక నుంచి ప్రకృతి వ్యవసాయం ముందుకెళ్తుందని చెప్పారు. దీంతో రైతులు, మహిళలు ప్రకృతి వ్యవసాయ విధానంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పీఎండీయూ కిట్లు, మోడల్స్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీ ప్రేమ్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

ఇంకొల్లు (చినగంజాం): పొట్టకూటి కోసం పరాయి రాష్ట్రం వచ్చిన ఓ వ్యక్తి గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన ఇంకొల్లు పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ బత్తుల శ్రీనివాసరావు అందించిన వివరాల మేరకు బిహార్ రాష్ట్రం మాధేపుర జిల్లా సల్మాతుల్లి గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్(25) ఇంకొల్లు ప్రాంతంలో కోల్డ్ స్టోరేజ్‌లు రిపేరు చేస్తూ జీవనం చేస్తున్నాడు. ఇంకొల్లు కొణికి రోడ్డులో అప్పేరు వాగు వంతెనపై అతడిని గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సీఐ బత్తుల శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నక్కల దాడిలో మనుబోతు మృతి



బొల్లాపల్లి: నక్కల దాడిలో మనుబోతు తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఘటన మండల కేంద్ర సమీపంలోని బండ్లమోటు సబ్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. దీనిపై అటవీ శాఖ బొల్లాపల్లి సెక్షన్ అధికారి ఎం.సురేంద్ర వివరణిస్తూ.. నక్కలదాడిలో మనుబోతు తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు చెప్పారు. బండ్లమోటు పోలీసులు ఘటన ప్రాంతానికి చెరుకుని వన్యప్రాణి మృత దేహాన్ని పరిశీలించారు. పశు సంవర్ధక వైద్యులు పంచనామా నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది అటవీ ప్రాంతంలో కళేబరాన్ని ఖననం చేసినట్లు బీట్ అధికారి తెలిపారు.

ముగ్గురు వీఏఏల సస్పెన్షన్

ఉత్తర్వులు జారీచేసిన జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: ప్రభుత్వ నిధులను సొంతానికి వాడుకున్న ముగ్గురు గ్రామీణ వ్యవసాయ సహాయకులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళీ తెలిపిన వివరాల మేరకు.. గురజాల మండలం చర్లగుడిపాడు వీఏఏ వి.వెంకటేష్, కారంపూడి మండల ఒప్పిచర్ల వీఏఏ కేవీ శ్రీనివాసరావు, పిడుగురాళ్ల మండలం వీరాపురం గ్రామ మల్టీపర్పస్ ఆఫీసర్ పులిచర్ల వెంకటేష్ సస్పెండ్ అయిన వారిలో ఉన్నారు. వీరు ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా ఆర్బీకేలకు సరఫరా చేసిన విత్తనాలు, ఎరువులు విక్రయించగా వచ్చిన సొమ్మును సకాలంలో ఆయా ఏజెన్సీలకు చెల్లించకుండా.. సొంత ప్రయోజనాలకు వాడుకున్నారని వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి, సస్పెండ్ చేయటం జరిగిందన్నారు. ఎవరైనా ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్మును సొంతానికి వాడుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి



పిడుగురాళ్ల: గూడ్స్ రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని ప్రజాశక్తి నగర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు వివరాల మేరకు.. నడికుడి వైపు నుంచి గుంటూరు వెళ్తున్న గూడ్స్ రైలు కింద ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడి అక్కడికక్కడే మృతి చేందాడు. తల, మొండెం వేరవ్వడంతో మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. సాయంత్రం 4.30 గంటల సమయంలో ప్రమాదం జరిగి ఉంటుందని, మృతుడి వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహంపై ఎర్ర రంగు చొక్కా, నల్ల రంగు జీన్స్ ప్యాంట్ ఉన్నట్లు తెలిపారు. వివరాలు తెలియాల్సి ఉందని, మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసల నంబరు 94403 09859కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



బాణావత్ సామునిబాయి(ఫైల్)

రెంటచింతల: మల్లవరం గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాణావత్ సాముని బాయి(50)ని నీళ్ల ట్యాంకర్‌తో పొలం నుంచి గ్రామంలోకి వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి క్షతగాత్రురాలిని తీసుకెళ్లగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కె. వెంకట నారాయణరెడ్డి గ్రామంలో విచారించారు. వచ్చీరాని డ్రైవింగ్ కారణంగా తన పెద్దమ్మకు ప్రమాదం జరిగిందని మృతురాలికి కొడుకు వరుస అయ్యే బానావత్ కృష్ణనాయక్ తెలిపాడు. అయితే ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనకు రాజకీయ రంగు పులిమే ప్రయత్నం టీడీపీ నాయకులు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ కన్వీనర్ సైదా నాయక్ తెలిపారు. మృతురాలు భవన నిర్మాణ కార్మికురాలు. భర్త, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.